



# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఆగస్ట్ 11, 2026 సంపుటి : 2 సంచిక : 300 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

- కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు
- భారత్ మ్యాప్ కోసం లవ్లీనా చేసిన పోరాటానికి అభినందనలు
- కామన్వెల్త్ పతక విజేతలతో మోదీ ప్రత్యేక భేటీ
- అథ్లెట్లతో సరదాగా మాట్లాడిన ప్రధాని
- క్రీడాకారులకు లడ్డూలు తినిపించిన మోదీ
- దేశ గౌరవం కోసం చేసిన కృషిని ప్రశంసించిన ప్రధాని

**న్యూఢిల్లీ,ఆగస్ట్10**

దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని లవ్లీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు..



# సాగర్‌లో ముగిసిన వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు
- వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు



**నాగార్జునసాగర్,ఆగస్ట్10 :**

రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.



# 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'

» ఇంటిపై జాతాయ జెండాను ఆవిష్కరించిన రామచంద్రారవు

**హైదరాబాద్,ఆగస్ట్10 :**

'హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. సోమవారం తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ..14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'ను నిర్వహిస్తున్నామని.. పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. రాబోయే ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాంచందర్ రావు అన్నారు.

మిగతాద్ది 2 లో



2 లో

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

» ప్రజల అభిమానం చూరగొన్న నేత
» నర్సంపేట కాలేజీ కి పెద్ది పేరు పెడతాం
» సంతాపసభలో కేటీఆర్ వెల్లడి

**నర్సంపేట,ఆగస్ట్10 :**

ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.

లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు.




# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్10 :**

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు.

మిగతాద్ది 2 లో




# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

## రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు

**హైదరాబాద్,ఆగస్ట్10 :**

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ ప్రక్రియ ముగిసింది.

# బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

» రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
» స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
» సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
» పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి




**హైదరాబాద్,ఆగస్ట్10 :**

తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు.

# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి
మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

**హైదరాబాద్,ఆగస్ట్10 :**

తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.






# గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

.2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం
.అమెరికా పర్యటనలో డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్,ఆగస్ట్10 :**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా,

# బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

మొదటిపేజీ తరువాయి

పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

మొదటిపేజీ తరువాయి

ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలనుకుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

మొదటిపేజీ తరువాయి

ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

# గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు

తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

# ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్య్ర దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్య్ర పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

# పీపీపీ మోడల్ విడుదల చేసిన ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ పబ్లిక్ - ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పాలసీ -2026ను విడుదల చేసింది. స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు, పట్టణ మౌలిక వసతులు, వైద్యం, విద్య, పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం తదితర రంగాల్లో పీపీపీ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ.1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ ప్రాజెక్టుల పైప్‌లైన్ ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. 2026- 27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,500 కోట్ల స్టేట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ప్రభుత్వం కేటాయించింది. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక మూలధన అవసరాలను విజిఎఫ్ ద్వారా సర్కార్ భర్తీ చేయనుంది. ప్రాజెక్టుల ప్లానింగ్, అప్రైజల్, ప్రొక్యూర్‌మెంట్, అమలు, పర్యవేక్షణకు స్పష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ప్రారంభ దశలో ఆర్థికంగా లాభదాయకంగా లేని, భవిష్యత్తులో ఆదాయాన్ని సమకూర్చే అవకాశం ఉన్న ప్రాజెక్టులకు ప్రాజెక్ట్ వయబిలిటీ బ్రిడ్జి ఫండ్ ద్వారా వడ్డీలేని రుణాన్ని అందించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది.

÷-రైవేట్ రంగ పెట్టుబడులు, సాంకేతిక నైపుణ్యం, నిర్వహణ సామర్థ్యాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. నాణ్యమైన ప్రజా సేవలను అందించడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూలమైన మౌలిక వసతుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పీపీపీ విధానాలను పరిశీలించడంతో పాటు, సంబంధిత స్టేక్‌హోల్డర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ సంస్థలు, స్వయం ప్రతిపత్తి సంస్థలు పీపీపీ పాలసీ-2026ను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బదిలీలపై నిషేధం

ఏపీలో కీలక అధికారుల బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పక్రియ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కీలక ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగులపై నిషేధాన్ని అక్టోబర్ 3 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సర్ పక్రియ పూర్తయ్యే వరకు కీలక అధికారుల బదిలీలకు బ్రేక్ పడనుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు జులై 1, 2026 అర్హత తేదీగా నిర్ణయించారు. ఏపీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం(ఈసీ) సవరించింది. దీని ప్రకారం, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ÷-లకెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ÷-లకెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార పక్రియ సెప్టెంబర్ 28 వరకు కొనసాగనుంది. అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ సవరించిన షెడ్యూల్ నేపథ్యంలో బదిలీల నిషేధాన్ని ఏపీ ప్రభుత్వం పొడిగించింది. ఈ నిర్ణయం ప్రకారం ఎన్నికల జాబితా సవరణకు సంబంధించిన కీలక అధికారులు అక్టోబర్ 3 వరకు అదే స్థానాల్లో కొనసాగాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ పేరుతో జివో 1545 జారీ అయ్యింది.

# ఐపిఎస్ రామాంజనేయులుకు పోస్టింగ్

ఏపీలో ఎస్పీ బదిలీ, పోస్టింగ్‌లను చేస్తూ ఆంధప్రదేశ్ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎన్.వి. రామాంజనేయులను తక్షణమే బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు అమల్లోకి

వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఎన్.వి. రామాంజనేయులు ఉన్నారు. ఆయనను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో నియమించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులో రామాంజనేయులుకు పోస్టింగ్ ఇచ్చారు. రామాంజనేయులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏపీ హోంశాఖ ఆధ్వర్యంలో జీవో ఆర్టీ నంబర్- 994 ద్వారా జి. విజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

**- నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా**
**- మీడియాతో చిట్‌చాట్‌లో రాంచంద్రరావు విమర్శలు**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్ట్‌ను తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. క్యూర్‌పై ఆగస్ట్ 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం.

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

# 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'

మొదటిపేజీ తరువాయి

అందులో భాగంగానే ఈరోజు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని యువతతో కలిసి తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు. లాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లడించారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబంధించింది కాదని... భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత భారత్' సంకల్పంతో చేపడుతున్న యాత్ర అని చెప్పారు. హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.

అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్

ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు.

మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ÷ూఖాఖ ÷ంఉఇ-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం ఆగస్ట్ 11, 2026

# పాత తలుపు పడి. ఏడేళ్ల బాలిక మృతి వెల్దుర్తి పట్టణంలోని కోటకింద వాడలో సంఘటన

◆ కన్నీరు మునిరైన కుటుంబ సభ్యులు అలేఖ్య మరణం తో కుటుంబ సభ్యులకు జీవితకాలం కోలుకో లేని ఘటన

**జాతీయ భూమి వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఆగస్టు 10**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని పూట కింద వాడలోపాత తలుపు మీదికి పడటంతో తీవ్ర గాయాలపాలై ఏడేళ్ల బాలిక మృతి చెందిన విషాద సంఘటన యెల్దుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుందని.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యెల్దుర్తి పంచాయతీ కార్మికుడైన ఆశాల ఏసు కుమార్తె అలేఖ్య (7) సోమవారం ఉదయం ఇంటి బయట ఆడుకుంటోంది. ఈ క్రమంలో అక్కడే పక్కన ఉంచిన పాత తలుపును, డోర్‌ఫ్రేమ్‌ను ఎక్కేందుకు చిన్నారి ప్రయత్నించడంతో. ఒక్కసారిగా ఆ తలుపు, ఫ్రేమ్‌తో సహా చిన్నారిపై పడిపోవడంతో ముఖానికి తీవ్ర గాయాలయ్యాయని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలికను చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలిక మృతి చెందిందని. ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని తండ్రి ఏసు స్పష్టం చేయగా, వెల్దుర్తి ఎస్ఐబి.కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ఆ కుటుంబంలో తీవ్రవిషాదఛాయలుఅ




ముకున్నాయి. అలేఖ్య తండ్రి గ్రామపంచాయతీ కార్మికుడు గా పని చేస్తున్నాడని అందరితో ఎంతో ఆప్యాయతగా ప్రేమతో ఉంటూ తన విధులను నిర్వహించడంలో ఎంతో ప్రాముఖ్యతను వహించిన



అతనికి ఆ భగవంతుడు తన కూతురు అలేఖ్య మృతిచెందడం వెల్దుర్తి పట్టణంలో అందరిని చలింప చేసిందని కళ్ళముందే ఆట ఆడుకుంటున్న తమ కూతురు అలేఖ్య చావడంతో అతను వారి కుటుంబ సభ్యులు ఎంతోగాను విలపించడం చూసి తిలకించాలని వచ్చిన జనాలు సైతం పెట్టిన సంఘటన కోట కింద వాడలో చోటుచేసుకుంది ఇలాంటి దురదృష్ట పరిస్థితులు ఏ తల్లిదండ్రులకు వాటిలకు ఉండదని పలువురు తెలిపారు అలేఖ్య మరణం మర్చిపోలేని ఒక సంఘటనగా అనే చెప్పుకోవచ్చు అలేఖ్య ఆత్మకు శాంతి కలగాలని అందరం కోరుతున్నామని అక్కడికి వచ్చిన ప్రజానీకం తెలిపారని తెలియజేశారు

## కీసరగుట్టకు పోటెత్తిన భక్తులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

## రాంపల్లి బస్‌స్టాప్‌లో నిలిచిన నీరు ప్రయాణికుల అవస్థలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



కీసర మండలంలోని రాంపల్లి బస్‌స్టాప్‌లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో దోమల లార్వా వృద్ధి చెందడంతో పాటు పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు నిలబడేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. దోమల కారణంగా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి నిలిచిన నీటిని తొలగించి, బస్‌స్టాప్ పరిసరాలను శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అరుదైన ప్రసవం జరిగింది. రాజేశ్వర్‌రావుపేటకు చెందిన రాజలక్ష్మి-నరేందర్ దంపతులకు తొలి సంతానంగా ఒక బాబు, ఇద్దరు పాపలు జన్మించారు. తల్లి, ముగ్గురు చిన్నారులు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

## మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటియుసి కార్మికుల నిరసన



**గాజెంగి మహేశ్వర్,కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కనీస వేతనాలు పెంచాలని నిరసన తెలిపారు.మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలుగా అమలు చేయాలని, జీవో ఎంఎస్ నెంబర్ 14 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ కోరారు.ఈ నిరసనలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, యమ నరసయ్య, మధురమ్మ, లక్ష్మి, బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం తదితర కార్మికులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**గాజెంగి మహేశ్వర్,కరపత్రం ప్రతినిధి**



మెట్‌పల్లి పట్టణ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు అధ్యక్షతన రేకుర్తి హాస్పిటల్ సహకారంతో జోగా జనార్ధన్ స్మారకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సేవలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ పాల్గొన్నారు.

## కొల్చారం మండల గర్భిణీ స్త్రీలకు "మాతృదేవోభవ" కానుక గా ప్రోటీన్ కిట్టను పంపిణీ చేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

◆ గర్భిణీ స్త్రీలకు అవసరమైన పోషకాహారం అందించాలని కార్యక్రమమే మాతృ దేవోభవ

◆ ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండటం ప్రతిబిడ్డ ఆరోగ్యంగా జన్మించాలి అనే ఉద్దేశంతోనే ప్రోటీన్ పోషకాహారాన్ని అందజేయడం తన కర్తవ్యం

◆ గర్భిణీ స్త్రీల ఆరోగ్యం తెలుసుకొని వారితో కలిసి భోజనం చేసిన ఆవుల రాజిరెడ్డి

కొల్చారం మండలంలో 300 మంది గర్భిణీ స్త్రీలకు ఉచితంగా ప్రోటీన్ కిట్ల పంపిణీ

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఆగస్టు 10**

మెదక్ జిల్లాకొల్చారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి "మాతృదేవోభవ" కార్యక్రమం ద్వారా 300 ప్రోటీన్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు.కొల్చారం మండల కేంద్రంలోని బాబా గార్డెన్స్, రంగపేటలోని శ్రీ రంగనాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలకు అవసరమైన పోషకాహారం అందించడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యానికి తోడ్పడాలనే ఉద్దేశంతో "మాతృదేవోభవ" కార్యక్రమాన్నికొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా ఉండటం, ప్రతి బిడ్డ ఆరోగ్యంగాజన్మించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం గర్భిణీ స్త్రీలతో కలిసి ఆవుల రాజిరెడ్డి భోజనం చేశారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.







## క్రషర్, రైస్ మిల్ నిర్వాహకులకు బెదిరింపులు.. ఇద్దరి అరెస్ట్ రూ.30 లక్షలు డిమాండ్..

◆ రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**

వ్యాపారులను బెదిరించి భారీగా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరిని వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సోమవారం ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం... వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురువయ్యను బెదిరించి రూ.20 లక్షలు డిమాండ్ చేయగా, బాధితుడు రూ.50 వేల నగదు ఇచ్చినట్లు ఎస్పీ



తెలిపారు. అలాగే రైస్ మిల్ నిర్వాహకుడు బండ మల్లేశంను బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులైన దండు వినోద్, పెద్దిగారి అమరగొండ అజయ్‌లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. అక్రమ వసూళ్లు, బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు సాహెబ్ హుస్సేన్

**కరపత్రం ప్రతినిధి కమలాపూర్, ఆగస్టు 10:**

కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామంలో ఇందిరమ్మ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ సాహెబ్ హుస్సేన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గూడూరు గ్రామంలో నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరై లబ్ధిదారులకు అందుబాటులోకి వచ్చిన ఇళ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎండీ సాహెబ్ హుస్సేన్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల నిర్మాణ కార్యక్రమాలు



అభినందనీయమన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నిరుపేదలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు.

# స్వర్గీయ శివశంకర్ సేవలు చిరస్మరణీయం:ఎంపీ రవిచంద్ర



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 10**
మున్నూరుకాపు ముద్దు బిడ్డ, బీసీల ఆరాధ్య నాయకులు, కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ పుంజాల శివశంకర్ 97వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఘనంగా నివాళులర్పించారు.శివశంకర్ సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలకోర్చి ఇష్టంగా చదువు కొనసాగించి న్యాయవాదిగా గొప్ప పేరు గడించారని, కేంద్ర మంత్రిగా దేశానికి విశేష సేవలందించారని తన సందేశంలో ఎంపీ రవిచంద్ర కీర్తించారు. న్యాయకోవిదులుగా,న్యాయ,విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రిగా, ఆర్థిక సంఘం ఛైర్మన్ గా,కేరళ, సిక్కిం రాష్ట్రాల గవర్నర్లుగా పేద వర్గాల వారికి, దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.ఇటు రాష్ట్రంలో,అటు జాతీయ స్థాయిలో బీసీలకు రిజర్వేషన్లు సాధించి పెట్టిన మహనీయులు శివశంకర్ అని ఎంపీ రవిచంద్ర శ్లాఘించారు.పేదల హక్కుల సాధనకు, సామాజిక న్యాయం కోసం అనన్య సామాన్యమైన సేవలందించిన ఆయన ఆత్మకథ "అదొక్కటే ముగింపు"చదివి స్ఫూర్తిపొంది జీవితంలో ఉన్నతంగా ఎదగాల్సిందిగా విద్యార్థులు, యువతకు ఎంపీ వద్దిరాజు పిలుపు నిచ్చారు.

# జనధన్ ఖాతాలపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య

- వరంగల్ జిల్లాలో 3.02 లక్షలకు పెరిగిన జనధన్ ఖాతాలు.. క్రియాశీల ఖాతాల్లో మాత్రం తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరించాలి: కడియం కావ్య



**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ, ఆగస్టు 10**
వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జనధన్ యోజన అమలు, జనధన్ ఖాతాల సంఖ్య, ఆధార్ అనుసంధానం, రూపే కార్డుల జారీ, ఖాతాల క్రియాశీలత, ప్రత్యక్ష నగదు బదిలీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య సోమవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణ, డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలపై కూడా ఆమె వివరాలు కోరారు.
కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం వెల్లడించిన గణాంకాల ప్రకారం వరంగల్ జిల్లాలో జనధన్ ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా, 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. అదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు, రూపే కార్డుల సంఖ్య 2,12,030 నుంచి 2,26,409కు పెరిగినట్లు తెలిపారు. అయితే ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ వాటి క్రియాశీల వినియోగంలో తగ్గుదల కనిపించింది. 2024 మార్చిలో 2,28,257 జనధన్ ఖాతాలు క్రియాశీలంగా ఉండగా, 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. జనధన్ ఖాతాలకు అనుసంధానమైన ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.
ఖాతాలు తెరవడమే కాదు.. వినియోగంలోకి తేవాలి
ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడంతోనే ఆర్థిక సమ్మిళితం పూర్తికాదన్నారు. ప్రతి ఖాతా నిరంతరం వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేలా బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయాలని కోరారు. మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులకు డిజిటల్ చెల్లింపులు, బ్యాంకింగ్ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.
వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, ప్రత్యక్ష నగదు బదిలీ ప్రయోజనాలు అందేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# ఉత్తమ కామర్స్ అధ్యాపకుడిగా డాక్టర్ శ్రీరామ్ దైదకు ఐపీఏ పురస్కారం



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 10**
కామర్స్ విద్యా రంగంలో విశిష్ట సేవలు, నాణ్యమైన బోధన, పరిశోధన, విద్యార్థుల మార్గదర్శకత్వానికి గుర్తింపుగా కాచిగూడ బద్రుక కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామ్ దైదకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రాక్టికల్ అకౌంటెన్సీ (ఐపీఏ) 'బెస్ట్ కామర్స్ ఫ్యాకల్టీ అవార్డు -2025' అభించింది. ఐపీఏ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్ దైదకు లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్ దైద మాట్లాడుతూ.. ఈ పురస్కారం తన విద్యా సేవలకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. రెండు దశాబ్దాలకు పైగా కామర్స్ విద్యా రంగంలో సేవలందిస్తున్న డాక్టర్ శ్రీరామ్ దైద బోధనతో పాటు పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, అకాడమిక్ మార్గదర్శకత్వం, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, పరిశోధనా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పరిశోధనా వ్యాసాల ప్రచురణ, పుస్తక రచనతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, పరిశోధనా దృక్పథం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషిచేస్తున్నారు. తనను ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, సహచర అధ్యాపకులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి లేని లోటు పూడ్చలేనిది

- పెద్ది విగ్రహం కోసం నిర్మించిన గద్దె కూల్చివేత దుర్మార్గం: దాస్యం వినయ్‌భాస్కర్





**కరపత్రం ప్రతినిధి కాజీపేట, అక్టోబర్ 10**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి యాదిలో కాజీపేట చౌరస్తాలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ అర్బన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గబ్బేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్‌రెడ్డి నిస్వార్థమైన గొప్ప తెలంగాణ ఉద్యమకారుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తామిద్దరం కలిసి అనేక పోరాటాలు, బంద్‌లు, వంటా వార్పులు, రాస్తారోకోలు, రైల్ రోకోలు నిర్వహించామని గుర్తుచేశారు. ఉద్యమంలో భాగంగా ఎన్నో కేసులు ఎదుర్కొని కోర్టులకు వెళ్లామని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కోసం కలిసి పనిచేసిన అనుబంధం తమకు ఉందన్నారు.
నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి పెద్ది సుదర్శన్‌రెడ్డి నిరంతరం కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి, ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. పెద్ది విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన గద్దెను కూల్చివేయడం దుర్మార్గమని, మాజీ ప్రజాప్రతినిధి విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని అధికారికంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నార్లగిరి రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ సుంచు కృష్ణ, మాజీ కార్పొరేటర్లు సిరాజుద్దీన్, సంకు నర్సింగరావు, సోద కిరణ్, వద్దిరాజు గణేష్, ఎండీ అఫ్జల్, ఎండీ హుస్సేన్, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, దువ్వ కనకరాజ్, బెదురుకోట రంజిత్, గబ్బేట కరుణ్ (సిద్దు), బరిగెల వినయ్, ఎస్.కె. మహమూద్, దువ్వ నరేష్ (కిట్టు), మాచర్ల ప్రభాకర్, కంజర్ల మనోజ్, కొండ శంకర్, మరియాల కృష్ణ, తండముల వేణు, రాబర్ట్, సయ్యద్ యాకూబ్, మంద రాజ్‌కుమార్, బండి రామచందర్, పడిదల శేఖర్, బరబరి శ్రీకాంత్, గౌరీ శంకర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# చైతన్య భూమిలో విశ్వ జ్ఞానులకు పూల మాలలు



- ముఖ్య అతిధి : బల్ల ఈశ్వరి

**కరపత్రం ప్రతినిధి ఆగస్టు 10,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా.**
మల్కాజ్గిరి మున్సిపల్ కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ లోని రాజీవ్ గృహ కల్ప కాలనీ లోని మాల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో చైతన్య భూమి వద్ద ఉన్న మహా నీయులు మహాత్మా జ్యోతి రావ్ పూలే, బాబా సాహెబ్ డాక్టర్, బి, ఆర్, అంబెద్కర్ విగ్రహాలకు ప్రతి ఆదివారం జరిగే పూల జరుగుతుంది, ఈ 31 మరియు 231 జ్ఞాన మాల కార్యక్రమనికి వచ్చిన ముఖ్య అతిధి బల్ల ఈశ్వరి అ మహానుభావులకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారికీ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షాల్వాతో సతక్కరించారు ,ఈ సందర్బంగా బల్ల ఈశ్వరి మాట్లాడుతూ కార్యక్రమం లో పూల మాల వేసే అవకాశం ఇచ్చిన సంఘానికి ధన్యవాదములు చెప్పుతూ ఈ చైతన్య భూమి వేదిక నుండి నేను తెలుసు కున్న లేదా నేర్చుకున్న ప్రతిదీ మన జాతికి తప్పకుండ వ్యక్త పరుస్తా అని అన్నారు.ఈ కార్యక్రమం లో మాల సంఘం అధ్యక్షులు కోలాటి,రాజు,బయ్యే గౌతమ్, మోతె రాజేంద్ర ప్రసాద్, పాడుగుల రూప చంద్రమౌళి,చెన్నయ్య, కె వి ఆర్,బత్తుల శ్రీనివాస్, గ్యాస్ వెంకటేష్, పోతుల వెంకటేష్, కానుకయ్య,వెంకట రమణ, పాల్గొని కార్యక్రమన్ని విజయవంతం చేసారు.

# ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి

- ఆగస్టు 15న ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి: తెలంగాణ రక్షణ సేన





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 10**
తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సహాయ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోరుతూ కాళోజి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు డప్పుచప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఉద్యమకారుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా తెలంగాణ రక్షణ సేన నాయకుడు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం, ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బాషాబోయిన రవీందర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు, అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు విద్యార్థి ఉద్యమ కారులకు ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉద్యమకారుల పిల్లలకు ఉచిత కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందించాలని, మృతి చెందిన ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
ఉద్యమకారుల సమస్యలపై కేకే కమిటీ వివిధ జిల్లాలు, మండలాలు, గ్రామాలు, విశ్వవిద్యాలయాలు, ప్రజా సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమకారులు అనుకోకుండా మృతి చెందితే ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఆగస్టు 15న ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలపై ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులంతా ఏకతాటిపైకి వచ్చి ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వీర బిక్షపతి, మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అనిల్ నాయక్, వరంగల్ తూర్పు ఇన్‌చార్జి వెలిగేటి రవికుమార్, హనుమకొండ జిల్లా నాయకులు బండారి సుమన్ పటేల్, మానుపాటి రమేష్, నిశాంత్ రావు, అలుగోజు నాగరాజు, జివ్వాది రమేష్, బొచ్చు రాజు, జలుగూరి రమేష్, గుండ్రెడ్డి రోహిత్, జన్ను సంతోష్, జన్ను చిరంజీవి, దుప్పటి ప్రకాష్, పంజాల శ్రీరామ్, దండు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు జ్యోతి రెడ్డి, లలిత యాదవ్, ఆకుల విజయ, మంజుల రావు, లలిత కుమారి, విద్యార్థి నాయకులు సుతేజ్, భరత్, మహీధర్, గణేష్‌తో పాటు ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రభాకర్, జేరిపోతుల రమేష్, ముక్కెర కుమారస్వామి, జంపాల సురేందర్, ఎల్తూరి సురేష్, బుర్ర రవీందర్ గౌడ్, కుక్కల జ్ఞానేశ్వర్, సంకెళ్ల రవీందర్, కాలే యాదగిరి, నర్ర సురేందర్, పోతురాజు ప్రభాకర్, పోతురాజు మల్లికార్జున్, కల్వచర్ల సుదర్శన్, గోలి విద్యాసాగర్ రెడ్డి, బిల్లా యాదగిరి, దంతాల రవి, రేణిగుంట్ల దుర్గాప్రసాద్, కావేటి రవీందర్, తాళ్లపల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్.వి. మహేందర్ కుమార్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 10**



గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వి. మహేందర్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఆలయ పరిసరాల్లో భక్తుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో సి.కే. మూర్తి, నరేందర్ యాదవ్, శేఖర్ చారి, రవీందర్ రెడ్డి, గుజ్జ నవీన్, జగదీష్ గుప్తా తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# బొగ్గు గ్యాసిఫికేషన్‌కు రూ.46 వేల కోట్లతో ప్రోత్సాహక పథకాలు

- సింగరేణి నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదన రాలేదు
- రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ప్రశ్నకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 10**
బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు గణనీయమైన మూలధన పెట్టుబడి అవసరమని, కొత్త రంగం కావడంతో సాధ్యాసాధ్యాల పరంగా పలు సవాళ్లు ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ.కిషన్‌రెడ్డి తెలిపారు. వ్యూహాత్మక జాతీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు.
బొగ్గు గ్యాసిఫికేషన్ వల్ల కేంద్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందా? గ్యాసిఫికేషన్ ప్లాంట్ ఏర్పాటుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అనుమతులు కోరిందా? ఇందుకోసం ఆర్థిక సహాయం అందించారా? అనే అంశాలపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానమిస్తూ.. బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు ఆర్థిక ప్రోత్సాహక పథకాలకు ఆమోదం తెలిపిందన్నారు. 2024 జనవరి 24న రూ.8,500 కోట్లతో, 2026 మే 13న రూ.37,500 కోట్లతో ఈ పథకాలకు ఆమోదం లభించిందని తెలిపారు. మొత్తంగా రూ.46 వేల కోట్లతో బొగ్గు గ్యాసిఫికేషన్ రంగానికి ప్రోత్సాహం అందించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.
గ్యాసిఫికేషన్ ప్లాంట్ల ఏర్పాటుతో పాటు పర్యావరణ పరిరక్షణ, భద్రత, చట్టబద్ధమైన కార్యకలాపాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. అయితే బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోరుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నుంచి తమ శాఖకు ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదన అందలేదని స్పష్టం చేశారు. బొగ్గు మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ఆర్థిక ప్రోత్సాహక పథకాల ప్రయోజనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు సహా అర్హత కలిగిన దరఖాస్తుదారులందరికీ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.
సింగరేణి సంస్థ బొగ్గు గ్యాసిఫికేషన్ కార్యక్రమాల కోసం ఎలాంటి ఆర్థిక సహాయాన్ని కోరలేదని, అందువల్ల తమ శాఖ నుంచి ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహకం కేటాయించలేదని మంత్రి కిషన్‌రెడ్డి రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.